క్లుప్తంగా

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

బాడంగి: మండలంలోని కోడూరులో అనాథలకు అదే గ్రామానికి చెందిన అమ్మ ఫౌండేషన్ వారు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్న ఇప్పిలి చిన్న, చిన్నారి, నందిని, అప్పలనాయుడులకు రూ.10 వేలు ఇచ్చారు.

ఆధార్ సేవల పరిశీలన

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట, జగన్నాధపురం సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపీడీవో పి.రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. అక్కడికి వచ్చే పౌరులకు అవసరమైన కొత్త ఆధార్‌కార్డు, పాత ఆధార్‌లో పేర్లు, పుట్టిన తేదీల్లో మార్పులను ఏ విధంగా చేస్తున్నారన్న అంశాలను తనిఖీ చేశారు. ఉచితంగా అందిస్తున్న ఈ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఎంపీడీవో కోరారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు ఉన్నారు.

పక్కాగా మెనూ అమలుచేయండి



మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి, పక్కాగా మెనూ అమలు చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హోమ్‌వర్క్ పుస్తకాలు, చేతిరాత, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటకాలు తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచి, శుచికరమైన భోజనం అందివ్వాలని సిబ్బందికి తెలిపారు.

ముగిసిన శిక్షణ

బాడంగి: మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల వార్షిక ప్రణాళికల తయారీపై వీవోఏలు, ఎన్యూమరేటర్లకు ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను సభ్యులకు ఏ మేర ఆర్థికసాయం అవసరం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని ఏపీఎం రత్నకుమార్ తెలిపారు. కార్యక్రమంలో రామభద్రపురం ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మహిళా సంఘాల సభ్యులంతా ఆర్థికంగా బలోపేతం కావాలని రాజాం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ ఎ.చిరంజీవి ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాల వీవోఏలు, ఎన్యుమరేటర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలతో ఏ విధంగా స్వయం ఉపాధి పొంది, అభివృద్ధి చెందాలన్న విషయాలపై శిక్షణ ఇచ్చారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

వంగర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఈ నెల 6వ తేదీన జరగాల్సిన ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ఈ నెల 13వ తేదీకి వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. విద్యార్థులంతా ఈ విషయం గమనించాలని, ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పాఠశాలల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు

బాడంగి: మండలంలోని పలు పాఠశాలల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో పి.లక్ష్మణదొర తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గజరాయునివలస, అల్లువానివలస ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా, బాడంగి, గొల్లాది, కోడూరు, పాల్తేరు, వాడాడ, రేజేరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు(ప్రైమరీలు)ను ఆదర్శ పాఠశాలలుగా మార్చాలని ప్రతిపాదనలు చేశామన్నారు. మిగిలిన వాటిలో 1 నుంచి 5 తరగతులున్న ప్రైమరీలు బేసిక్ ప్రైమరీలుగా 1, 2 తరగతులను ఫౌండేషన్ ప్రైమరీలుగా పిలుస్తామన్నారు. అలాగే భీమవరం ప్రాథమికోన్నత పాఠశాల యథాతథంగా కొనసాగుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా చలివేంద్రం శుక్రవారం ప్రారంభించారు. అటువైపుగా వచ్చే వాహనదారులు, పాదచారులకు సీఐ కె.సతీష్‌కుమార్ మజ్జిగ పంపిణీ చేశారు. ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'పచ్చ' మెప్పు కోసం.. రెడ్ చిచ్చు!

- రెడ్‌జోన్ పేరిట వీధి వ్యాపారాలు ఖాళీ
- నోటీసులు ఇవ్వకుండా అధికారుల చర్యలు
- రోడ్డున పడిన 50 కుటుంబాలు
- బాధితులంతా దళిత మహిళా వృద్ధులే
- జీవో నంబరు 137ను కాలరాసిన కమిషనర్



సగం ఖాళీ చేయించి, ఇలా సగం వదిలేసిన దృశ్యం



మున్సిపల్ అధికారులు వీధి వ్యాపారులను ఖాళీ చేయించిన శ్రీనివాసా రోడ్డు



మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న వీధి వ్యాపారుల సంఘం నాయకులు(ఫైల్)

రాజాం: అధికార టీడీపీ(పచ్చ పార్టీ) నేతల మెప్పు కోసం అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యేలు, వారి అనుచరుల ఆశీస్సులు పొందేందుకు నిరుపేదల బతుకులను కొడుతున్నారు. ప్రశ్నించే వారికి పంగనామాలు, అడ్డుకుంటున్న వారిపై దౌర్జన్యాలూ ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వంలోని పార్టీల నాయకుల వేధింపులు ఓవైపు.. వారికి వత్తాసు పలుకుతున్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు మరోవైపు.. ఇలాంటి పరిస్థితుల నడుమ విసిగివేశారుతున్న బాధితులకు దిక్కు తోచడంలేదు. ఇదీ రాజాం మున్సిపాలిటీలో ఇటీవల చోటుచేసుకున్న తంతు. రాజాం పట్టణంలోని మాధవబజార్‌కు ఆనుకుని ఉన్న శ్రీనివాసా మార్కెట్ రోడ్డులో వ్యాపారాలు చేసుకుంటున్న 50 మందిని ఇటీవల మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఖాళీ చేయించారు. బాధిత వ్యాపారులంతా దళిత కుటుంబాలకు చెందిన మహిళా వృద్ధులే కాగా వీరంతా గ్రామాల్లో పండించిన కూరగాయలను ఇక్కడకు తీసుకువచ్చి వాటిని అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు నెలలుగా వీరి వ్యాపారాలను అధికారులు కొనసాగనివ్వకపోవడంతో వారంతా రోడ్డునపడ్డారు. రోజువారీ వచ్చే ఆదాయంపై బతికే వారు ఇప్పుడు ఆ ఆదాయం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలేవీ..?

పట్టణంలో రెడ్‌జోన్ పేరు ఇటీవల తెరమీదకు వచ్చింది. ఈ జోన్ పేరుతోనే శ్రీనివాసా రోడ్డులోని వీధి వ్యాపారులను ఖాళీ చేయించారు. వాస్తవంగా ఈ రోడ్డు విశాలంగా ఉంది. మరోవైపు ఎప్పటినుంచో ఈ రోడ్డు ద్వారానే రాజాంలో జరిగే గురువారం సంతకు, ప్రతిరోజూ మాధవబజార్‌కు కొనుగోలుదారులు, వ్యాపారులు వెళ్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్కెట్‌ను నమ్ముకుని చాలా కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరిలో తోపుడు బండ్ల వ్యాపారులు కూడా ఉన్నారు. రోడ్డును విశాలం చేయాలనే ఉద్దేశంతో వ్యాపారులను ఖాళీ చేయించామని చెబుతున్న అధికారులు.. బాధితులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా ఎలా ఖాళీ చేయిస్తారని పలువురు అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. బాధితులు కూడా న్యాయం కోసం రోజూ మున్సిపల్ కార్యాలయానికి వెళ్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు.

అప్పుడు లేని ఇబ్బంది.. ఇప్పుడేంటి..?

వాస్తవంగా ఠాణా వీధి నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు అంతా మార్కెట్ రోడ్డే. వన్‌వే అమలులో ఉన్న సమయంలోనే ఈ రోడ్డు మీదుగా ఆర్టీసీ వాహనాలు కూడా తిరిగేవి. అప్పుడు కూడా అదే వ్యాపారులు ఉండేవారు. అయినా ఎటువంటి ఇబ్బందులు రాలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలకు ఈ రోడ్డు చాలా అవసరమైంది. ఇదే దారిలో ఎమ్మెల్యే సహా పార్టీ కార్యకర్తలంతా కాన్వాయ్‌తో గుయ్‌గుయ్‌మంటూ తిరుగుతున్నారు. వీరికి ఇక్కడి వీధి వ్యాపారుల వల్ల ఇబ్బందులు రావడంతో హుటాహుటిన వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇదే రోడ్డులో ఆక్రమణల సంగతి పట్టించుకోని అధికారులు.. పేదలపైనేనా ప్రతాపం అని అందరూ విమర్శిస్తున్నారు.

పేరుకే జీవో.. అమలు చేయడం లేదు..

వీధి వ్యాపారులు, విక్రయదారులకు రక్షణ కవచంలా ఉండేలా జీవో నంబర్ 137ను అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం ఢాకా మోగిస్తోంది. ఈ జీవో ప్రకారం వీధి వ్యాపారులు తమ జీవనోపాధి నిమిత్తం రోడ్డు పక్కనే యథేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు. ఆర్టీసీ వాహనాలు తిరగని ప్రాంతాల్లో వీరిని ఖాళీ చేయించే అధికారం ఎవరికీ ఉండదు. ఒకవేళ ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేయించాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలి. ఇవేమీ జరగకుండానే ఇక్కడ వీధి వ్యాపారులను ఖాళీ చేయించారు.

పేదల పొట్ట కొట్టారు..



రాజకీయ లబ్ధి కోసమే అధికారులు వీధి వ్యాపారులను ఖాళీ చేయించారు. ఆ వ్యాపారులంతా పేదలే.. కమిషనర్ వారి పొట్టను కొట్టారు. జీవో నంబర్ 137 ఉన్నా వారిని ఖాళీ చేయించారంటే దాని వెనక రాజకీయ కోణం కచ్చితంగా ఉంది. బాధిత వీధి వ్యాపారుల తరఫున న్యాయపోరాటానికి సిద్ధం.

–తెద్దు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి, వీధి వ్యాపారుల సంఘం

రోడ్డున పడ్డాం..



శ్రీనివాసా రోడ్డులో నుంచి తమను ఆకస్మికంగా ఖాళీ చేయించడం దారుణం. ఇప్పుడు వ్యాపారాలు లేక రోడ్డున పడ్డాం. ఇంతవరకు తమకు చూపించాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా హామీ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ఆదుకోవాలి.

–రెడ్డి సీతమ్మ, వీధి వ్యాపారి, రాజాం

ఖాళీ చేయించడం అన్యాయం..



ఎప్పుడూ కిక్కిరిసి ఉండే మాధవబజార్‌లో రెడ్‌జోన్ ఏదీ? మేము వ్యాపారం చేసుకునే దగ్గరే రెడ్‌జోన్ వచ్చిందా.. అప్పుడెప్పుడూ లేని ఇబ్బంది ఇప్పుడేంటి. రెండు అడుగుల విస్తీర్ణంలో చేసుకునే వ్యాపారంతోనే నష్టమా.. ఏది ఏమైనా మమ్మల్ని ఖాళీ చేయించడం అన్యాయం.

–యజ్జల లక్ష్మి, వీధి వ్యాపారి, రాజాం

ట్రాఫిక్ ఇబ్బందులే కారణం..



రాజాం శ్రీనివాసా రోడ్డును వీధి వ్యాపారులు క్రమక్రమంగా రోడ్డును ఆక్రమించేస్తున్నారు. వ్యాపారాలు రోడ్డు మీదికి వస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అటువైపుగా వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు రెడ్‌జోన్‌గా గుర్తించి, వ్యాపారులను ఖాళీ చేయించాం. వారికి రైతుబజారులో అద్దెకు షాపులు ఇస్తామంటే అద్దెలు చెల్లించలేం అంటున్నారు.

–జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం

రాజాం టీడీపీ నాయకులకు భంగపాటు!

- ఏఎంసీ చైర్‌పర్సన్‌గా జనసేన నాయకురాలు పొగిరి కృష్ణవేణి



టీడీపీ అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజాం టీడీపీ కార్యాలయంలో సమావేశమైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాజాం: రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎంపికలో టీడీపీ నేతలకు భంగపాటు ఎదురైంది. జనసేన పార్టీ నాయకుడు పొగిరి సురేష్‌కుమార్ సతీమణి కృష్ణవేణి చైర్‌పర్సన్‌గా ఎంపికకావడం పచ్చపార్టీ నేతలకు మింగుడు పడడంలేదు. రాజాం మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడిని ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వడం ఖాయమన్న ప్రచారం సాగింది. పట్టణానికి చెందిన మరో ఇద్దరు టీడీపీ నాయకులు, వంగర మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు, సంతకవిటి మండలానికి చెందిన ఓ కళాకారుడు కూడా ఈ పీఠం కోసం కుస్తీపడి అధిష్టానం నిర్ణయం వద్ద చతికిలపడ్డారు. అధిష్టానం నిర్ణయంపై నిరసన తెలుపుతూ పాలకొండ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. చంద్రబాబునాయుడు తీరును దుయ్యబట్టారు. కనీస క్యాడర్ లేని జనసేన పార్టీకి ఏఎంసీ పదవి ఏమిటంటూ మండిపడ్డారు.

నేత్ర శస్త్రచికిత్సకు 10 మంది ఎంపిక



మహిళ కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి జ్యోతి

వంగర: కంటి ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ జ్యోతి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 50 మంది కళ్లను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే నేత్ర శస్త్రచికిత్సల కోసం 10 మందిని ఎంపిక చేసి, ఆపరేషన్‌ల నిమిత్తం వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మనోహర్‌ను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్


రాజాం: స్థానిక పట్టణంలోని మెంతిపేట ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సవలాపురపు మనోహర్‌ను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మనోహర్ తండ్రి లక్ష్మణరావు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజేష్.. ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి ఆసపు సూర్యం, యందవ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు రమాదేవి, తులసి కోరారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో వైసీబీ ఎన్‌జీవో సీహెచ్ హరీష్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు 18 ఏళ్ల వయసు నిండకుండా వివాహాలు చేయవద్దని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్నారులు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరిగే వాటిని అరికట్టేందుకు గ్రామస్థాయిలో కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

రామభద్రపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అన్ని సచివాలయాల మహిళా పోలీసులతో ఎస్ఐ వి.ప్రసాదరావు శుక్రవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, మహిళలు, బాలికలపై దాడులు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, కొత్త చట్టాలు, లోన్ యాప్‌ల మోసాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలి



ముస్లింలకు అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకుడు శంకరరావు

బొబ్బిలి: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని పలు మసీదుల వద్ద వక్ఫ్ సవరణ బిల్లు ద్వారా కలిగే నష్టాలను ముస్లిం సోదరులకు శుక్రవారం వివరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న ఈ సవరణ ద్వారా ముస్లింల ఆస్తులకు పరిరక్షణ ఉండదని, పటిష్టంగా ఉన్న చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు. ఇదే బిల్లు పాస్ అవ్వడానికి రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు కూడా ఆమోదం తెలపడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును ఎవరూ కాలరాయకూడదన్నారు. అటువంటి దుశ్చర్యకు పాల్పడితే కఠిన ఊరుకోబోమని, పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను అణగదొక్కేందుకే..

బొబ్బిలి: ముస్లింలను అణగదొక్కేందుకే వక్ఫ్ బిల్లు సవరణను కేంద్రం తీసుకువచ్చిందని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్ భాషా విమర్శించారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలోని 30 వక్ఫ్‌బోర్డుల ఆస్తులు.. 9.40 లక్షల ఎకరాల్లో లక్షా 20 వేల కోట్లపైగానే విలువ కలిగి ఉందని, వాటిపై ఇతర మతస్తులకు అధికారాలను కల్పించడం కోసం సభ్యుల్ని మార్చే ప్రయత్నాలు జరుగుతుండడం దుర్మార్గమన్నారు. గతంలో ముస్లింల ఆస్తులు కాపాడే ప్రభుత్వాలు ఉంటే ఇప్పుడు ఆ ఆస్తులు దోచుకునే ప్రభుత్వాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వక్ఫ్ బిల్లు సవరణను వెనక్కి తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

'మత్తు'తో జీవితం చిత్తు

రేగిడి: మండలంలో తాటిపాడు గ్రామంలో రాజాం జీఎంఆర్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్(జాతీయ సేవా పథకం) వలంటీర్లు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, సారా, మద్యం, సిగరెట్ వంటి మత్తు కలిగించే పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉన్నతమైన జీవనం సాగించాలని కోరారు. అనంతరం అదే గ్రామంలో జరిగిన నేత్రవైద్య శిబిరాన్ని సందర్శించి కంటి పరీక్షలు చేస్తున్న తీరును గమనించారు. శిబిరానికి 150 హాజరు కాగా వారిలో 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావునాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ శనివారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే బేబీనాయన, రాష్ట్ర, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, మండల నాయకులంతా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని, ప్రతిఒక్కరూ రావాలని కోరారు.

ఎరువులు తయారు చేయండి

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామ ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని మండల పంచాయతీ విస్తరణాధికారి ఏవీ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్త ద్వారా ఎరువులు తయారు చేసి, దానిని రైతులకు సబ్సిడీపై అందజేయాలని, అలా చేయడం ద్వారాం పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరావు, స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రతపై ప్రచారం

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎండల తీవ్రతపై రెవెన్యూ అధికారులు శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఎండలు రోజురోజుకూ ఎక్కువవుతున్న కారణంగా అందరూ జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని తెలిపారు. రైతులు కూడా చల్లని సమయాల్లో పొలం పనులు చేసుకోవాలని, వర్ష సూచన ఉంటే వెంటనే ఇంటికి వచ్చేయాలన్నారు.

• స్మార్ట్‌మీటర్లు వద్దు 'బాబు'..



బొబ్బిలిలోని 30వ వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న స్మార్ట్‌మీటర్ల ద్వారా కలిగే నష్టాలను వివరించారు. అలాగే స్మార్ట్ మీటర్లు వద్దు.. కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇవే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటులో గత ప్రభుత్వాన్ని విమర్శించి, ఇప్పుడు మీరెలా తీసుకువస్తారని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. తక్షణమే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్.గోపాలం, బి.యుగంధర్, జి.గౌరి తదితరులు పాల్గొన్నారు. –బొబ్బిలి

• షట్టర్లు బాగు చేయరూ..



రేగిడి మండలం, ఆడవరం వద్ద ఉన్న సాయన్నచానల్ షట్టర్లు బాగు చేయాలని సర్పంచ్ ఈశ్వరమ్మ సహా పలువురు రైతులు కోరుతున్నారు. శుక్రవారం షట్టర్లు పరిశీలించిన వారు.. కాలువలో పేరుకుపోయిన పూడికలు, గుర్రపుడెక్క, కలుపుమొక్కలను తొలగించాలని, పాడైన షట్టర్లను బాగు చేయాలని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. షట్టర్లు బాగుచేయకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు బి.రామకృష్ణ, కె.అప్పలనాయుడు, ఎల్.గణపతిరావు, కె.సింహాచలం, బి.రామినాయుడు, పి.చక్రధర్, కె.పారన్నాయుడు, కె.లక్ష్మీణారాయణ, కె.శరత్ కుమార్, ఎం.రామారావు, డి.రామినాయుడు, కె.తిరుపతిరావు, బి.చిన్నప్పలనాయుడు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. –రేగిడి

రెండు పూటలా పనిచేయాలి

రాజాం: మండలంలోని ఒమ్మి, కంచరాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో సాయిరాం శుక్రవారం పరిశీలించారు. వేసవి ఎండల బారినపడి వడదెబ్బకు గురికాకుండా చల్లగా ఉన్న సమయాల్లో రోజుకు రెండు పూటలా పనిచేయాలని వేతనదారులకు సూచించారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్‌బాటిళ్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని నారాయణప్పవలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో పి.రవికుమార్ శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు.

• విద్యార్థులే స్వీపర్లు..!



తరగతి గదిని తుడుస్తున్న విద్యార్థులు



వరండాలో తుడుస్తున్న మరో విద్యార్థి

చిత్రంలో చీపుర్లు పట్టుకుని తరగతి గదులను ఊడ్చుతున్నది రామభద్రపురం మండలం జన్నివలస పంచాయతీ పరిధిలోని నేర్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు. ఇక్కడ స్వీపర్లు నుంచి బెల్ కొట్టే పనుల వరకు విద్యార్థులు చేయాల్సిందే. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పర్యవేక్షణ లోపించింది. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న 110 మంది విద్యార్థులకు బోధన సరిగా సాగడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడా సదుపాయాలు కూడా లేవు. మరుగుదొడ్ల, స్నానపు గదుల తలుపులు పూర్తిగా పాడైనా పట్టించుకునేవారే కరువయ్యారు. వరండాల్లోనే చదువు చెబుతున్నారు. పాఠశాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, పాఠశాలకు అటెండర్ లేకపోవడం, ఒక ఆయా ఉంటే అప్పుడప్పుడు పిల్లలు పరిశుభ్రత పనుల్లో సాయం చేస్తున్నట్టు హెచ్ఎం జి.కృష్ణారావు తెలిపారు.

- రామభద్రపురం

రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో సమావేశం



రాజకీయ పార్టీల నేతలతో చర్చిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో జేవీవీఎస్ రామ్మోహనరావు శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఇప్పటికే ప్రచురణ అయిన తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఓటరు జాబితా సరళీకరణ, నిరంతర ఓటరు నమోదు ప్రక్రియ, ఆధార్ అనుసంధానం వంటి వాటిపై చర్చించారు. పక్కా ఓటరు జాబితా తయారీకి ఎన్నికల కమిషన్ అవకాశమిచ్చిందని, ప్రతీ గ్రామంలో నిజమైన ఓటర్లు మాత్రమే ఓటు వేసేలా చూడాలని ఆర్డీవో కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు బలివాడ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.